# నిర్బంధానికీ నిషేధానికీ గురికాని రచయితలు ఉన్నారా?

అన్ని రకాలు నిర్బంధాలలోనికీ అభిప్రాయాలపైన నిషేధం చాలా అభ్యంతరకరం అనిపిస్తుంది. పుస్తకాలను నిషేధించడం, తగల బెట్టడం, సాహిత్యకారులనూ, తత్వవేత్తలనూ జైలులో పెట్టడం, చంపడం, అత్యంత అనాగరికమయిన చర్యలనిపించుకుంటాయి.

అయితే విచిత్రం ఏమిటంటే చరిత్ర



లోకి చూస్తే నిర్బంధం నిషేధం ఎంత విరివిగ అమలు అయ్యాయంటే వాటికి గురికాని రచయితలయినా తాత్వికులయినా ఉన్నారా అనిపిస్తుంది. లేకేం—ఉన్నారు. కాని వాళ్లందరూ ఏ దశలోనూ పాలకులను వ్యతిరేకించని పెద్దమనుషులు. అటువంటి వాళ్లలో కొందరు తెలివి తేటలలో అనల్పులే గాని చరిత్రలో వాళ్ల ఆయుస్సుమాత్రం అల్పమే. ఇప్పటికీ వాళ్లను తలచుకుంటున్నామంటే అందుకు పాలక వర్గాల చలవ ఒక కారణం కాగా, మన సమాజం పూర్తిగ మారకుండ ఉండిపోవడం రెండవకారణం. మారిన రోజున వాళ్లను తలచుకోవడం మానేస్తాము.

పాలకులను వ్యతిరేకించిన వాళ్లకు మాత్రం నిర్బంధాలూ నిషేధాలూ తప్ప లేదు. ఆయా దేశ కాల పరిస్థితులనుబట్టి



ఆల్డస్ హక్స్లీ

ఈ అణచివేత పుస్తకాల దహనం నుండి రచయిత సజీవదహనం దాకా అనేక రూపాలు తీసుకుంది. హోమర్‌ను రోమ్‌లో కలిగులా నిషేధించాడు. చైనాలో కన్‌ఫ్యూషియస్ పుస్తకాలను క్రీ.పూ. 250 లో ట్సిన్ రాజవంశం మొదటి చక్రవర్తి తనకు దొరికిన మేరకు తగలబెట్టాడు, అతని అనుయాయులను సజీవంగా ఖననం చేసాడు. 50 సంవత్సరాల తరువాత చి హువాంగ్‌టె అనే చక్రవర్తి తనకు మిగిలిపోయిన గ్రంథాలను వెతికిపట్టి తగలబెట్టాడు. మన చార్వాకుడిని ఢిల్లీ పొలిమేరలలో సజీవంగా దహనం చేసారు. చరిత్ర కలిగులాను మరచిపోయిన తరువాత హోమర్ రచనలు ఇంకా మిగిలే ఉంటాయనీ, మావోతో బాటు కన్‌ఫ్యూషియస్ ఒక్కడే ప్రపంచానికంతా తెలిసిన చైనీయుడిగా మిగిలిపోతాడనీ, ఇన్ని శతాబ్దాల తరువాత చార్వాకుడి గురించి సమాజంలో మళ్లీ కుతూహలం పుట్టుకొస్తుందనీ ఆనాడు నిర్బంధం ప్రయోగించిన వాళ్లు ఊహించి వుండరు.

## దాచేస్తే దాగని సత్యం

ఇది ప్రాచీనకాలం మాట. ఇవ్వాళ మన చుట్టూ చూస్తే లాటిన్ అమెరికాలో ఎందరో రచయితలూ మేధావులూ జైళ్లలో ఉన్నారు. అవి మిలిటరీ పాలనలో ఉన్న దేశాలు లెమ్మనుకుంటే భారత ప్రజాస్వామ్యం కథ అందుకు భిన్నం కాదు. ఎక్కడి దాకో పోనక్కరలేదు. కవిత్వాన్ని నిషేధించి కవులను నిర్బంధించడంలో గత రెండు దశాబ్దాలుగా ఆంధ్ర రాష్ట్రం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. అందరికంటే ఎక్కువ నిర్బంధాన్ని అనుభవించిన కవి వరవరరావు మీద, ఆయన సికిందరాబాద్ జైలులో ఉండగానే, ప్రభుత్వ 'టెర్రరిస్టు కేసులు' ఒక దాని తరువాత ఒకటి పెట్టుకుంటూ పోతోంది.

ఆనాటికీ ఈ నాటికీ మధ్య నిషేధాలూ నిర్బంధాలూ నిర్విరామంగా సాగుతూనే ఉన్నాయి. ఆధునిక ప్రజాతంత్ర భావనకు పుట్టినిల్లు అనుకునే పశ్చిమ యూరప్ నుండి మతసహనానికి ఆదర్శం అని చెప్పుకునే భారతదేశం దాకా ప్రపంచంలో ఏ ప్రాంతమూ ఈ చరిత్రను తప్పించుకోలేదు. పాశ్చాత్యదేశాలలో ఆధునిక ప్రజాతంత్ర భావాలు ఒక క్రమంలో వ్యవస్థీకృతం అవుతున్న కాలంలో— క్రీ.శ. 13 నుండి 19 వ శతాబ్దం దాకా— నిషేధాలకు గురయిన రచయితల జాబితా చదివితే ప్రముఖ పాశ్చాత్య రచయితల జాబితా చదివినట్టే. షేక్స్‌పియర్, మిల్టన్, షెల్లీ, గోల్డ్‌స్మిత్, మపాసా, బాల్జాక్, గిబ్బన్, వాల్టేర్, రూసో, టాంపెయిన్, ఫీల్డింగ్, గథె, కాంట్, జాన్ లాక్, పాస్కల్, డేనియల్ ఢిఫో, స్విఫ్ట్, రెనె దకార్టె, గలిలియే, మిగ్వెల్ సెర్వాంటె,మకియవెలి, విట్‌మాన్, మార్క్‌ట్వైన్, జాన్‌స్టువార్ట్ మిల్, థామస్ హార్డీ, ఆస్కార్ వైల్డ్, కిప్లింగ్, టాల్‌స్టాయ్, ఇబ్సెన్, బెర్నార్డ్ షా, జెంస్ జాయిస్, అప్టన్ సింక్లైర్, సింక్లైర్ లెవీ, డి. హెచ్ లారెన్స్, జాక్ లండన్, ఎమిలీజులా, హెమింగ్‌వే, ఆల్డస్ హక్స్లీ, ఆల్‌ఫ్రెడ్ అడ్లర్, సిగ్మండ్ ఫ్రాయిడ్, మాగ్జింగోర్కీ— చివరికి ఎవ్వరినీ నొప్పించని తత్వశాస్త్ర చరిత్రకారుడు విల్‌డ్యూరంట్ సహితం ఈ జాబితాలో ఉన్నారు. (ఇక మార్క్స్, లెనిన్, టాల్‌స్టోయ్‌లు పేర్లు చెప్పనక్కరలేదుకదా!) ఇంకెవరయినా ప్రముఖులు మిగిలి పోయారా అని వెతుక్కుంటున్నారా? కష్టపడి వెతికితే ఒకరిద్దరు దొరుకుతారేమో.

మనదేశం మత (అంటే అభిప్రాయ) సహనానికి నిలయం అనేది విస్తృతంగా ప్రాచుర్యం పొందిన స్వాతిశయం. అయితే ఇక్కడ ఎంతో కొంత సహించింది వైదిక మతాలను మాత్రమే. వేదాలనూ వర్ణవ్యవస్థనూ అంగీకరించిన మతాలు— ఇతర విషయాలలో విభేదించినా— ఏదో ఒక మేరకు నిలవగలిగాయి. అంగీకరించని మతాలు బలవంతంగా ఈ అంగీకారాన్ని తమ దార్శనిక దృక్పథంలోకి చొప్పించవలసి వచ్చింది. దాని వల్ల సాంఖ్యం వంటి దర్శనాలు కృత్రిమంగా తయారయ్యాయి. వీరశైవం అభాసయింది. ఈ మాత్రం సర్దుబాటు కూడా చేసుకోని మతాలు నామ రూపాలు లేకుండా పోయాయి. జైన దేవాలయాలను బలవంతంగా ఆక్రమించుకొని శివుడికీ విష్ణువుకూ గుళ్ళు కట్టారు. బౌద్ధ దేశంలో మిగలకుండాపోయింది. లోకాయతం

మాటకొస్తే, మహాభారతం కథ ప్రకారం 'అలుగటయే ఎటుంగని' అజాత శత్రువు సమక్షంలో చార్వాకుడిని చంపడమేగాక, లోకాయత గ్రంథాలను అన్నింటినీ వైదిక మతానుయాయులు పనిగట్టుకొని ధ్వంసం చేశారనీ, అందుకే తాత్విక దృక్పథాన్ని గురించిన ప్రస్తావన ప్రాచీన సాహిత్యంలో విస్తృతంగా ఉన్నా దానిని వివరించే గ్రంథం ఒక్కటీ మిగలలేదనీ దేవీ ప్రసాద్ ఛటోపాధ్యాయ నుండి జవహర్‌లాల్ నెహ్రూ దాకా చాలామంది అభిప్రాయపడ్డారు. లోకాయతం లాగే, శైవమతాలైన కాపాలిక, కాలముఖ మతాలగురించి ఒక్క గ్రంథమూ ఇప్పటిదాకా దొరకలేదు. అన్ని రకాల శైవులతో వాదనలు పెట్టుకున్న శంకరాచార్యులు అవైదికులైన కాపాలికులను మాత్రం కొరడాతో కొట్టించినట్లు అతని సమకాలికుడు ఆనందగిరి 'శంకర విజయం' లో స్వయంగా—గర్వంగా—చెప్పుకున్నాడు.

మతాధికారాన్నీ రాజ్యాధికారాన్ని వ్యతిరేకించిన వాళ్లందరికీ ఇదే గతి పట్టింది. నిషేధానికీ నిర్బంధానికీ గురైన పాశ్చాత్య రచయితలందరూ మతాధికారాన్ని రాజ్యాధికారాన్ని ప్రశ్నించినవాళ్లే. కాథలిక్ మతాధికారులకు ఆమోదనీయం కాని రచనలను ఆ మతస్థులు చదవకూడదు. ఇట్లా నిషేధించిన రచనల జాబితాకు 'ఇండెక్స్' అనేది క్లుప్తమైన పేరు. ప్రముఖ యూరోపియన్ రచయితలందరూ 'ఇండెక్స్'లో చోటు చేసుకున్నవారే. ఇది అన్నిటికంటే తేలికైన నిషేధం— ప్రొటెస్టెంట్ మతానుయాయుల సంఖ్య పెరిగేకొద్దీ రచయితలకు 'ఇండెక్స్'లో చేర్చిన పుస్తకాలను చదివే పాఠకులు దొరుకుతూనే ఉన్నారు. అయితే ఒక ఇబ్బంది ఏమిటంటే, 'ఇండెక్స్'లో చేర్చిన పుస్తకాల ప్రతులను కాథలిక్ మతాధికారులు అప్పుడప్పుడు తగలబెడుతూ ఉండేవారు. అంటే మార్టిన్ లూథర్, మిల్టన్, పాస్కల్, డిఫో, స్విఫ్ట్, వాల్టేర్, రూసోల రచనలను మతాధికారులు తగులబెట్టారు. వాల్టేర్‌తో సమంగా పుస్తకాలను అగ్నికి ఆహుతి ఇచ్చిన రచయిత 18వ శతాబ్దంలో వేరొకరు లేరని అతని గురించి ప్రతీతి. గలీలియో టెలిస్కోప్ నిర్మాణం మీద రాసిన ఒక పుస్తకాన్ని ఆయన చనిపోయిన తర్వాత మతాధికారులు తగులబెట్టారు. అందులో ఏముందని భయపడ్డారో! మార్క్ ట్వైన్ పుస్తకాలను చిన్నపిల్లల లైబ్రరీలలో పెట్టకూడదని అమెరికాలో కొన్నిపట్టణాలలో నిషేధం



ఆస్కార్ వైల్డ్

పెట్టారట. ఈ రెండు చర్యలకూ తెలివి తక్కువ తనంలో తేడా ఉన్నట్టు అనిపించింది. పుస్తకాలను నిషేధిస్తే నిషేధించారుగాని వివేచన అయినా ఉండనక్కరలేదా అని బాధపడ్డ రచయితలలో గిబ్బన్ ఒకడు. ఈయన ప్రాచీనకాలపు రోమన్ సామ్రాజ్య చరిత్ర మీద రాసిన పుస్తకాన్ని 18వ శతాబ్దంలో రోమ్‌లో నిషేధించారు. క్రిష్టియన్లు పవిత్రంగా భావించే పాలస్తీనాను 'ఎడారి సదృశమైన ప్రాంతం' అని తాను వర్ణించినందుకు క్రిష్టియన్లు అభ్యంతరం చెప్పడం గిబ్బన్‌కు కోపం కలిగించింది. 'నేనొక నైసర్గిక వాస్తవం చెబితే దాన్ని ఆధ్యాత్మిక అపచారంగా భావిస్తారెందుకు?' అని వాపోయాడు. నైసర్గిక వాస్తవాలను ఆధ్యాత్మిక అపచారంగా భావించే దశనుండి సామాజిక వాస్తవాలను రాజకీయ అపచారంగా భావిం



అర్నెస్ట్ హెమింగ్వే

చే దశకు ఎదిగినట్టున్నాం! లేకపోతే వరవరరావు కవితా సంకలనం 'భవిష్యత్ చిత్రపటాన్ని' ప్రభుత్వం ఎందుకు నిషేధించాలి.?

మతాధికారులను వ్యతిరేకించడం కంటే రాజ్యాధికారంతో తలపడడం ఒక రకంగా ఇంకా ప్రమాదకరమైన విషయం. రాజుల 'దైవదత్త'మైన అధికారాన్ని ప్రశ్నించిన మిల్టన్ కొద్దిలో ఉరి తప్పించుకున్నాడు. జార్ చక్రవర్తి మీద కుట్ర చేసాడన్న ఆరోపణపై శిక్షపడిన దస్తాయవ్‌స్కీ ఉరి కంబం దాకా పోయి చివరి నిముషంలో ఉరి తప్పించుకున్నాడు. ఫ్రాన్సులో వాల్టేర్ దేశ బహిష్కరణ నుండి భయంకర కారాగారం అయిన బాస్టిలీలో నిర్బంధందాకా చాలా రూపాలలో అణచివేతను అనుభవించాడు. విక్టర్ హ్యూగో 20 సంవత్సరాల దేశ బహిష్కరణ చవిచూసాడు.

జాన్‌లాక్ ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో ఉద్యోగం పోగొట్టుకుని హాలండ్‌కు పారిపోయి మారు పేరుతో 'అండర్‌గ్రౌండ్' లో గడిపాడు. నాజీ పాలనలో నాజీ మూకలు బెర్లిన్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 25,000 పుస్తకాలను తగలబెట్టినప్పుడు ఆ పుస్తకాల రచయితలు ప్రాణం దక్కించుకోగలిగితే జర్మనీ వదిలిపెట్టి ఇతర దేశాలకు పారిపోవల్సి వచ్చింది.

వాళ్లలో నలుగురు ప్రముఖులు ఫ్రాయిడ్, అడ్లర్, ఐన్‌స్టైన్, థామస్‌మాన్.

రచయిత చెప్పిన అభిప్రాయాలు సరైనవా కావా అన్న మీమాంస పాలకులకు ఎన్నడూ లేదు. ఆ అభిప్రాయాలవల్ల తమ మనుగడకు ఇబ్బంది అవుతుందా లేదా అన్నదే వాళ్ల సమస్య.

అమెరికా స్వాతంత్ర్య సమరానికి తాత్విక ప్రాతినిధ్యం వహించిన వాళ్లలో థామస్ పెయిన్ ఒకడు. అతనిని రాజద్రోహ నేరానికి విచారణిస్తూ ఇంగ్లండ్ ప్రధాన మంత్రి విలియంపిట్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. 'పెయిన్ అభిప్రాయాలు సరైనవే. కాని మనం వాటికి ప్రోత్సాహం ఇస్తే ఇక్కడ విప్లవం వచ్చి పడుతుంది' అన్నాడు.

షేక్స్‌పియర్ కూడా నిషేధానికి గురి అయ్యాడన్నాను. ఇంగ్లండ్‌ను పరిపాలించిన మూడవ జార్జికి మతిస్తిమితం లేదు.

అది అందరికీ తెలుసును. అయినా రాజుగారి దేవతావస్త్రాల వ్యవహారంలాగా తెలియనట్టే అందరూ నటించాలి.

అందువల్ల 'కింగ్ లియర్' నాటకానికి రెండు శతాబ్దాలు ప్రదర్శనకు లైసెన్స్ దొరకలేదు. ఆ నాటకం మొదటి ప్రదర్శన షేక్స్‌పియర్ చనిపోయిన తర్వాత 214 సంవత్సరాలకు జరిగింది.

ఇంతకంటె బలమైన కారణాల వల్ల తమ నాటకాలను ప్రదర్శించలేక పోయినా, నాటక రచయితలు ఇబ్సెన్, ఆస్కార్ వైల్డ్, బెర్నార్డ్ షా, విక్టర్ హ్యూగో, యూజీన్ ఓనీల్. వీళ్లందరూ ఏదో ఒక నాటకానికైనా లైసెన్స్ దొరకని రచయితలే.

వీళ్లుకాక పాశ్చాత్య నాటక రంగంలో ప్రముఖ రచయితలు వేరేఎవరైనా ఉన్నారా?

పుస్తకాన్ని నిషేధించకుండా అమ్మకాన్ని నిషేధించడం, లైబ్రరీల నుండి బహిష్కరించడం, పుస్తకాలను అద్దెకిచ్చే 'లెండింగ్ లైబ్రరీ' ల నుండి బహిష్కరించడం, పరోక్షంగా పుస్తకాన్ని నిషేధించడమే అవుతుంది. బాల్జాక్ కథలు అమెరికాలో; మపాసా కథలు ఫ్రాన్సులో, కెనెడాలో; థామస్ హార్డీ నవలలు రెండు(టెస్, జూడ్) ఇంగ్లండులో; ఈ రకమైన నిషేధానికి గురయ్యాయి.

ప్రజలలో నైతిక ప్రమాణాలు దిగజారడానికి ఇవి దోహదం చేస్తాయని వీటిని లైబ్రరీల నుండి తొలగించారు. 'నీతి' పేరిట నిషేధానికి గురైన రచయితలలో నీతికి జీవితంలో అత్యంత ప్రముఖ స్థానం ఇచ్చిన టాల్‌స్టాయ్ ఒకడు.

ఈయన రచనలను అమెరికాలో అమ్మరాదని నిషేధిస్తూ, అమెరికా అధ్యక్షుడు థియడర్ రూజ్‌వెల్ట్ టాల్‌స్టాయ్‌ని నైతికంగా దిగజారిన వ్యక్తి (పర్వర్ట్) అన్నాడట! టాల్‌స్టాయ్ గురించి అంతకంటే అన్యాయమైన మాట ఊహించడం కష్టం.

అభిప్రాయాలకు ప్రభుత్వాలు ఇంతగా భయపడడం మూర్ఖత్వం అనుకుంటే అది మన మూర్ఖత్వం అవుతుంది. ప్రభుత్వాలు సకారణంగానే భయపడుతాయి. అందుకు రుజువుగా— నిషేధాలు ఎప్పుడూ సమాజం రాజకీయంగా సంక్షోభంలో ఉన్నప్పుడే జరిగాయని గమనించవచ్చును.

బ్రిటీష్ హయాంలో తెలుగు సాహిత్యం మీద వాళ్ళ ప్రయోగించిన నిషేధాల సంఖ్య 45. వీటిలో కొన్ని పూర్తిగా నిషేధించిన పుస్తకాలు. కొన్ని సెన్సార్ చేసి. ప్రచురణకు అనుమతించిన పుస్తకాలు. కొన్ని ప్రదర్శనకు అనుమతి నిరాకరించిన నాటకాలు, కొన్ని ఒక సంచికను నిషేధించిన పత్రికలు.

అయితే చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే ఈ నిషేధాలన్నీ మధ్యతరగతిలో జాతీయ ఉద్యమం ప్రజ్వరిల్లిన కాలంలోనే జరిగాయి. 1921 దాకా మధ్య తరగతిలో జాతీయోద్యమమూ లేదు.

సాహిత్యంపైన నిషేధాలూ లేవు. కాంగ్రెస్ వారి సహాయ నిరాకరణోద్యమం బలంగాఉన్న 1921–22 సంవత్సరాలలో 13 నిషేధాలు ప్రయోగించబడ్డాయి. 'మాకొద్దీ తెల్ల దొరతనము' అన్న గరిమెళ్ల సత్యనారాయణను అరెస్టు కూడా చేశారు.

అయితే 1922 లో సహాయ నిరాకరణ ఉద్యమం విరమించబడడంతో నిషేధాలు కూడా ఆగిపోయాయి. మళ్లీ 1931 నాటికి 2 నాటకాలు ఒక నవల (మాలపల్లి) మాత్రమే నిషేధానికి గురయ్యాయి.

1931 తర్వాత మళ్లీ మధ్య తరగతిలో జాతీయోద్యమం ప్రబలడంతో నిషేధాలు మళ్లీ మొదలై 1945 దాకా నిరవధికంగా సాగాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మళ్లీ శ్రీకాకుళం గిరిజన పోరాటం తోనే కదా కవిత్వంపై నిషేధాలు మొదలయ్యాయి.

డాక్టర్ కె.బాలగోపాల్